క్లుప్తంగా

అమ్మాయిలను వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు

మక్తల్: అమ్మాయిలను వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని షీ టీం పోలీసులు బాల్‌రాజ్, చెన్నయ్య అన్నారు. మంగళవారం మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల దగ్గర విద్యార్థిలకు అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, సెల్‌ఫోన్ వినియోగం వల్ల ఏర్పాడే అనర్థాలు, పోటీ పరీక్షలు, లీడర్‌షిప్ లక్షణాలను వివరించారు. కళాశాలల్లో, ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే షీ టీం 87126 70398 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ప్రతి ఒక్కరు పట్టుదలతో చదువుకొని భవిష్యత్‌లో మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అరున్, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

మరికల్: ప్రభుత్వం రైతులందరికీ రైతు భరోసా నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతయ్య మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. యాసంగికి సంబంధించిన రైతు భరోసాపై స్పష్టత ఇవ్వకుండా కేవలం 4 ఎకరాల వరకే రైతు భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. యాసంగిలో పెండింగ్‌లో ఉన్న దానితో పాటు వానాకాలం పంటలకు కూడా వెంటనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేయాలని కోరారు.

వర్షపునీటిలో పంచాయతీ కార్యాలయం



కృష్ణా: మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లోని వీధుల్లో జలమయమయ్యాయి. ఆలంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి వర్షపునీరు రావడంతో బురదమయంగా మారింది. వర్షపునీరు నిలవడంతో ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి కార్యాలయంలో శుభ్రత చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బురద దారులు.. అవస్థలు బారెడు



మాగనూర్: మండలంలోని పలు గ్రామీణ రహదారులు చిన్నపాటి వర్షాలకే బురదమయమై చిత్తడిగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులు, ప్రయాణికులు నిత్యం ఈ దారుల వెంట ప్రయాణించాల్సి ఉంటుంది. నడిచేటప్పుడు బురదలో ఏమాత్రం కాలు జారినా అంతే సంగతులు. వర్షం పడిన ప్రతి సారి ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా అచ్చంపేట గ్రామస్తుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు అయినా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శిల్ప కళ వారసత్వాన్ని సంరక్షించాలి



నారాయణపేట రూరల్: ప్రాంతీయ శిల్పకళా వారసత్వాన్ని గుర్తించి సంరక్షించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు డీపీసీజీఎం భరత్ రెడ్డి తెలిపారు. మంగళవారం రిసల్యూట్ 4 ఐపీ బృందం జిల్లా కేంద్రంలోని సరఫ్ బజార్లో పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హస్తకళ, సాంస్కృతిక ప్రత్యేకతకు పేరుగాంచిన నారాయణపేట 24 క్యారెట్ బంగారం ఆభరణాలు భౌగోళిక సూచిక (జీఐ) రిజిస్ట్రేషన్ కోసం అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. నారాయణపేటలో ఇచ్చిన నాణ్యత, ఖ్యాతి, ఇతర లక్షణం దాని భౌగోళిక మూలానికి కారణమని చెప్పవచ్చన్నారు. జీ.ఐ. సాంప్రదాయ జ్ఞానాన్ని కాపాడటానికి రిజిస్ట్రేషన్ ఉపయోగపడుతుందన్నారు.

వర్షాలకు కూలిన మట్టి మిద్దె

దామరగిద్ద: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పిడెంపల్లి గ్రామంలో ఓ ఇంటి మిద్దె కూలిపోయింది. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన కావలి అశోక్ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పక్క గది పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. ప్రమాద సమయంలో ఆ గదిలో ఎవరు లేక పోవడంతో ప్రమాదం తప్పింది.

మలుపులు.. ప్రమాదాలకు నిలయాలు

- సూచిక బోర్డులు లేక తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



ప్రమాదకరంగా వడ్వాట్-అడవిసత్యరం రోడ్డు మూలమలుపు

మాగనూర్: మండలంలోని పలు ప్రధాన రోడ్లపై మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. వడ్వాట్-మందిపల్లి, అడవిసత్యరం-కోల్పూర్ ప్రధాన రహదారిలో అనేక చోట్ల మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మలుపుల వద్ద పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో కొత్తవారు ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. క్షతగాత్రులు కొన్ని సార్లు మరణిస్తుండగా మరికొన్ని కేసుల్లో వికలాంగులుగా మారి కుటుంబాన్ని కష్టాల్లోకి నెట్టుతున్నారు. అదే విధంగా ఉజ్జెల్లి వెళ్లే మార్గంలో కూడా మూలమలుపులు ఉండటంతో ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని అనేక సార్లు ప్రమాదాలకు గురయ్యాయి. ఇంతలా ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు

మండలంలో ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరగడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. వాడ్వట్ నుంచి అడవిసత్యరం మీదుగా మందిపల్లి వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి రోడ్డుపైకి వచ్చాయి. సింగిల్ లైన్ రోడ్డుకు తోడు ఇరువైపులా కంపచెట్లు, గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికులు సైతం నరకయాతన అనుభవిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం కానుండడంతో ఇరుకు రోడ్లతో అలాగే బురదమయంగా మారిన రోడ్లతో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. మరింత మంది ప్రాణాలు కోల్పోకముందే సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డుల ఏర్పాటుతో పాటు ముళ్ల పొదలను తొలగించి సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

బోర్డులు ఏర్పాటు చేయాలి



మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. జీబ్రా గుర్తులు వేయాలి. రాత్రి వేళల్లో రేడియం స్టిక్కరింగ్ కనిపించే విధంగా రోడ్లకు ఇరువైపులా వేయాలి. అలాగే రహదారులపై గుంతలను పూడ్చాలి. అధికారులు ప్రమాదాలు జరిగిన తరువాత పరిశీలించి వదిలేస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

– బసంత్‌రెడ్డి, వడ్వాట్, గ్రామస్తుడు

స్పందన కరవు



మలుపులు కనిపించకపోవడంతో రాత్రి సమయంలో ఎదురెదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి కిందపడి దెబ్బలు తగులుతున్నాయి. వడ్వాట్-అడవిసత్యరం గ్రామాల మధ్య రహదారి మరి ప్రమాదకరంగా తయరైంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు విన్నవించినా స్పందించకపోవడంతో ప్రమాదాలు ఆగడం లేదు. ఇప్పటికైనా మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సుమంత్, మాగనూర్, గ్రామస్తుడు

త్వరలోనే పనులు చేపడతాం



ముల మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్న మాట వాస్తవమే. అయితే ఈ విషయంపై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నూతనంగా నిర్మించిన రోడ్లపై ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇవి పాత రోడ్లు కావడంతో సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. త్వరలోనే పనులు ప్రారంభించి సమస్యలు పరిష్కరిస్తాం.

– మారుతీ, పంచాయతీ రాజ్, ఏఈ మాగనూర్.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కృష్ణా: మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఉదయం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ పుష్పలత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతారన్నారు. మండలంలోని లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.
మక్తల్: మక్తల్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్న ట్లు తహసీల్దార్ సతీశ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై చెక్కులను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో 105 మందికి చెక్కులు మంజూరయ్యాయని,లబ్ధిదారులు బ్యాంకు అంకౌట్,ఆధార్‌కార్డు తీసుకొనిరావాలని కోరారు.
మాగనూర్: మండలంలోని లబ్ధిదారులకు బుధవారం కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఇంచార్జి తహసీల్దార్ సురేష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. కావున లబ్ధిదారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



కోస్గి రూరల్: టీఎస్‌యూటీఎఫ్ కోస్గి మండల అధ్యక్షుడిగా పని చేస్తున్న ఉపాధ్యాయుడు రాములు గుండెపోటుతో మరణించారు. హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్న కుమార్తెను సోమవారం కళాశాలలో చేర్పించి వస్తుండగా గుండెపోటుతో మరణించారు. ఈయన పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వరిస్తున్నారు. ఈ క్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు రాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

నర్వ: అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్వ శివాలయం, పెద్దకడ్మూర్ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున లింగాష్టక, బిల్వార్చన, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకిసేవా కార్యక్రమాలు జరిపించారు. భక్తులకు అర్చకులు సిద్దయ్య, తంబలి నర్సింహయ్యలు తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బసదేశ్వర ఆలయంలో

నారాయణపేట రూరల్: కాళబెళగుందె బసదేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం అమావాస్య పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తర నియామవాళి, మహామంగళ హారతి ఇచ్చి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అదే విధంగా పట్టణంలోని యాద్గీర్ రోడ్‌లో గల అయ్యప్ప స్వామి దేవాలయం, శివలింగేశ్వర స్వామి దేవాలయం, మహంకాళి వీధి శివాలయం, మెట్టుగడ్డ ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.



పుట్ట మన్ను తీసుకొచ్చేందుకు వెళ్తున్న కురువ కులస్తులు

ఘనంగా ఎల్లమ్మ బండారు ఉత్సవాలు

ధన్వాడ: మండలంలోని హన్మన్‌పల్లి గ్రామంలో కురువ సోదరులు ప్రతి ఐదేళ్లకు ఒక సారి నిర్వహించే ఎల్లమ్మ బండారు ఉత్సవాలను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కుండలతో పుట్ట వద్ద వద్దకు వెళ్లి అక్కడ ఉంచిన పసుపు కుండలకు పూజలు జరిపించారు. ఇక బుధవారం కుటుంబ సభ్యుల సమక్షంలో ఎల్లమ్మకు పూజలు నిర్వహించి నైవేద్యాలు పెట్టి బీరప్ప బండరు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బుజ్జప్ప, సాయన్న, రాములు, ఎల్లప్ప, నాగరాజు, బీమప్ప పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులైన్



ధన్వాడ: ధన్వాడ మండలంలోని రాంకిష్టాయిపల్లి గ్రామ శివారులో మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయి తాగునీరు మొత్తం వృధాగా పోతుంది. గ్రామ శివారులో కొంత మంది రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు రోడ్డు మార్గం ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా రోడ్డు పక్కన ఉన్న చిన్నపాటి కాలువపై పైపులను ఏర్పాటు చేసుకునేందుకు జేసీబీతో గుంతలను తవ్వేందుకు ప్రయత్నించగా పైపులైన్ పగిలిపోయింది. సంబంధిత అధికారులు స్పందించి పైపులైనుకు మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో ఎస్సై వెంకటేశ్వర్లు

నారాయణపేట ఎడ్యుకేషన్: క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని నారాయణపేట ఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్-జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించి మెమొంటోలు అందజేశారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడుతూ.. మంగళవారం అండర్-8, అండర్-10, అండర్-12 విభాగాలలో పరుగు పందెం, లాంగ్ జంప్, జావెలిన్ త్రో, షాట్‌పుట్ వంటి వివిధ పోటీలు నిర్వహించగా 25 మంది ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యరన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారు జూన్ 1న సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటరన్నారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా అథ్లెటిక్ కోచ్ హరిక దేవి, కోచ్ జగదీష్, పీఈటీలు రమేష్, మహేష్, త్రివేణి, మణి, భాస్కర్, సత్యం, రాఘవేందర్, సాయి కుమార్, నర్సింములు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు



మరికల్: మండల కేంద్రంలోని సరస్వతీ కాలనీలో గుంతలమయంగా మారిన రహదారికి మంగళవారం సూర్యచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సరస్వతీ కాలనీలో వర్షాలకు గుంతలుగా ఏర్పడిన రహదారిని తమ ఫౌండేషన్ ద్వారా మట్టివేసి మరమ్మతులు చేయించామన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యలను కూడా తమ సంస్థ ద్వారా పరిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, రామకృష్ణ, రఘు, మల్లారెడ్డి, గోవర్దన్, రవి, హరీష్, ఆంజనేయులు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

నేడు వీర సావర్కర్ జయంతి

నారాయణపేట రూరల్: హిందూ జాతిని మేలుకోల్పేందుకు కృషి చేసిన మహనీయుడు వీర సావర్కర్ 142వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు భావ సమైక్య వేదిక నిర్వాహకులు జి.కుర్మన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్ దగ్గర గల వీర సావర్కర్ విగ్రహానికి ఉదయం 10గంటలకు పూజలు నిర్వహించి, పూలమాలతో నివాళి అర్పించనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం కావాలని కోరారు.

విద్యతోనే ప్రగతి సాధ్యం

- ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: విద్యతోనే ప్రగతి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. చదువుకుంటేనే ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని గతంలో కంటే మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు, టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ విద్యాబోధన చేసేందుకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. అనంతరం ముదిరాజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై దృష్టి పెట్టి అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజు, మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, సంఘం జిల్లా అధ్యక్షులు సరఫ్ నాగరాజు, రాష్ట్ర నాయకులు సంజీవ్, వకీల్ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫింగర్ ప్రింట్ డివైస్‌తో తనిఖీలు

కోస్గి రూరల్: కోస్గి బస్టాండ్‌లో వరుస దొంగతనాలు చోటు చేసుకోవడంతో నిర్మూలనలో భాగంగా ఫింగర్ ప్రింట్ డివైస్‌తో తనిఖీలు చేపట్టినట్లు కానిస్టేబుల్ అంబయ్యగౌడ్ అన్నారు. మంగళవారం కోస్గి బస్టాండ్‌లో పలువురి అనుమానితల ఫింగర్ ప్రింట్‌లను తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికుల మాటున కొంత మంది రద్దీగా ఉన్న సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నారని బస్సు ఎక్కే, దిగే సమయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రయాణికులకు సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే 100 డయల్ చేయాలన్నారు.



ఫింగర్ ప్రింట్ తీసుకుంటున్న పోలీసులు

లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి

ఆత్మకూర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేయాలని, ఎంపికైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణాలు చేపట్టే విధంగా అవగాహన కల్పించాలని మండల ప్రతేకాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాలకు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలానికి 220 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 187 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి కలెక్టరుకు నివేదించామన్నారు. అలాగే రాజీవ్ యువవికాసానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థుల నుంచి 1095 దరఖాస్తులు వచ్చాయని, 282 యూనిట్లు మంజూరయ్యాయని త్వరలోనే వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీపాద్, సీనియర్ అసిస్టెంట్లు పార్వతమ్మ, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయండి

నారాయణపేట రూరల్: పీఎస్‌లలో నమోదైన ప్రతీ కేసును క్షుణంగా పరిశీలించి వేగంగా పరిష్కరించేందుకు ఎస్‌హెచ్‌ఓలు కృషి చేయాలని డీఎస్పీ నల్లపు లింగయ్య ఆదేశించారు. స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో జిల్లాలోని మక్తల్, మరికల్, కోస్గి పోలీసు అధికారులతో మంగళవారం నిర్వహించిన నేర సమీక్షలో డీఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసులకు సంబంధించిన ప్రతి ఆధారాన్ని సంపాదించి, నేరస్తులకు కోర్టు ద్వారా తగిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేసులకు సంబంధించి ప్రతీది ఆన్‌లైన్ చేయాలని, నేరాల కట్టడికి అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రేవ్, నాన్ గ్రేవ్, పోక్సో కేసుల విషయంలో దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా యువత, గ్రామీణ ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని, డయల్ 100 ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. పీఎస్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. అలాగే భయం పోగొట్టి వారికి భరోసా కల్పించాలని సూచించారు. సమావేశంలో సీఐలు రామ్‌లాల్, సైదులు, ఎస్ఐలు భాగ్యలక్ష్మి, అశోక్‌బాబు, నవీద్, విజయ్, బాలరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

కూలిన కల్వర్టు.. రాకపోకలకు ఇబ్బందులు

ధన్వాడ: మండల కేంద్రంలోని కంసాన్‌పల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై రాకపోకలకు వాహనాదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మారుతీనగర్ కాలనీ వద్ద సింపునోని కాలువపై ఉన్న కల్వర్టు వర్షానికి కూలిపోయింది. దీంతో ధన్వాడ నుంచి కంసాన్‌పల్లి, యంనోనిపల్లి, గున్ముక్ల, మాంత్రోనిపల్లి గ్రామాలకు వెళ్లే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టి సీసీ రోడ్డు వేయాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.



రహదారిపై కూలిన కల్వర్టు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఆత్మకూర్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేయాలని శిక్షకురాలు తిరుపతమ్మ సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఆమె యోగా ఉత్సవాలను ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాష్ట్రంలో ఆయుష్ సంస్థ ఆధ్వర్యంలో 842 యోగా కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. యోగాతో రోగాలు నయం కావడంతో పాటు, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. జూన్ 21 వరకు యోగా ఉత్సవాలను నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి సన్మానం



దేవరకద్ర: దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని మంగళవారం పలువురు కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కోయిల్‌సాగర్ కాంగ్రెస్ నాయకులు జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించారు. అనంతరం కోయిల్‌సాగర్ మాజీ సర్పంచ్ వెంకటేశ్ ఎమ్మెల్యేకు శాలువా కప్పి ప్రత్యేకంగా తయారు చేసిన చిత్రపటాన్ని బహుకరించారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

నారాయణపేట రూరల్: రైతులు పంటల సాగులో రసాయన వినియోగాన్ని తగ్గించాలని శాస్త్రవేత్తలు డాక్టర్ పరిమళ కుమార్, డాక్టర్ సరిత సూచించారు. మండలంలోని పేరపళ్ళ గ్రామ రైతు వేదికలో మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. యూరియా వినియోగాన్ని తగ్గించి వాటి స్థానంలో పచ్చరొట్ట ఎరువులు, వర్మి కంపోస్టు, జీవన ఎరువులు వాడాలన్నారు. అధిక రసాయన ఎరువులు వాడకం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించి ప్రత్యమ్నాయంగా జీవ నాశినులు ఎరువులైన రైజోబియం, ట్రైకోడర్మా, సూడోమొనాస్ వంటివి వేసుకోవాలని సూచించారు. అనంతరం కరపత్రాలు విడుదల చేసి రైతుల పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఏఓ బాలదినకర్, ఏఈఓ ప్రకాష్, అంజమ్మ, అనిల్ కుమార్, రైతులు పాల్గొన్నారు.